

పీలేరు విద్యార్థికి కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం పీజీ సీటు

ప్రజాశక్తి-పీలేరు



పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్సి 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.వి.రిషిత కేరళ కేంద్రీయ విశ్వ విద్యాలయం, కాసర్గోడ్‌లో ఎమ్మెస్సీ రసాయన శాస్త్రంలో సీటు సాధించింది. దేశవ్యాప్తంగా జరిగిన పీజీ ప్రవేశ పరీక్షల్లో రిషిత 15వ ర్యాంకు సాధించి ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. రిషిత తల్లి డాక్టర్ బి.కవిత ఇదే స్థానిక డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మౌలిక వసతులు, అర్హత కలిగిన అధ్యాపకులున్న అంశాలను దృష్టిలో ఉంచుకుని తన తల్లి తనను ఇదే కళాశాలలో చదివించారని, అధ్యాపకుల ప్రోత్సాహంతో తాను ఈ విజయాన్ని సాధించానంటోంది. ఈ సందర్భంగా విద్యార్థిని రిషితను, ఆమె తల్లి కవితను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- తారెత్తిస్తున్న టమోటా
- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- వీటి బాటలోనే బీన్స్, క్యారెట్, కాకర
- కొత్తమీర కట్ట రూ.60
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది.. టమోటా ఒక్కసారి ఆకాశంలోకి ఎక్కి కూర్చుంది.. మేమేం తక్కువా అన్నట్లు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి.. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు వామ్మో అంటున్నారు.. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళితే... సగం బస్తా కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిర్చి ధర మార్కెట్‌లో రూ.100, కాకర రూ.60కి చేరింది. టమోటా రూ.60 నుంచి 80 మధ్యలో ఉంది. కొత్తమీర కట్ట కూడా టమోటా బాటలోనే ఉంది. ప్రతి వస్తువు ధర పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడులు వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు.



రాయచోటి కూరగాయల సంత

ప్రజాశక్తి-రాయచోటి

కూరగాయల ధరలు సామాన్యుడు కొనే పరిస్థితి లేకుండా పోయింది. పెరిగిన ధరల వల్ల కిలో కొనేవారు..పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరకు లభిస్తాయనుకుని మార్కెట్‌కు వస్తే ఇక్కడి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తుందో గానీ...దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కూరగాయలు కన్నీళ్లు తెప్పిస్తు న్నాయి. వారి వంటింట్లో ఉడకనంటూ భీష్మించుకున్నాయి. సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్టుకు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో టమోటాను పట్టుకుంటే దాని ధర ఠారెత్తిస్తోంది. పచ్చిమిర్చి ధర ఘాటెక్కి తనను ముట్టుకోవద్దంటోంది. ఇలా ప్రతి కూరగాయా సామాన్యుడిని ముట్టుకోనీయడం లేదు. ఎందుకంటే వాటి ధరలు అంత అమాంతంగా పెరిగి ఆకాశానికి నిచ్చనేశాయి. కనీసం పచ్చడి మెతుకులు తిందామనుకుంటే పచ్చిమిర్చి ధర రూ.100 చేరి అందనంత ఎత్తులో ఉంది. అన్నమయ్య జిల్లాలో ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో దేవపట్ల, సంబేపల్లి, చిన్నమండెం, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లి ప్రాంతాల్లో టమోటాల సాగు అధికంగా ఉంది. నెల కిందట రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమోటాలను రోడ్లపైనే పారే వేసి వెళ్లేవారు. ఇటీవల టమోటా ధర బాగా పెరగడంతో ఇదేఅదునుగా దళారీలు సొమ్ము చేసుకుంటూ అధిక ధరలకు విక్రయించడం మొదలుపెట్టారు. ఇదేమిటి అంటే కూరగాయల సాగు తగ్గిందని ధరలు పెరిగాయి అంటూ చెప్పి సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. గతంలో కిలో టమోటా ధర రూ.5, 10 ఉండగా నేడు ఏకంగా రూ.60 నుండి రూ.80 వరకు చేరింది. నిత్యం వంటకాల్లో టమోటా అవసరం తప్పదు కాబట్టి ఎంత ధర పెట్టి అయినా కొనుగోలు చేస్తున్నారు. వంకాయలు గతంలో కిలో రూ.20 నుండి రూ.30 ఉండగా నేడు అమాంతంగా రూ.40 నుంచి రూ.50, మునగ కిలో రూ.120 విక్రయిస్తున్నారు. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.50కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీధి దుకాణాల్లో కిలో రూ.60 చొప్పున అమ్ముతున్నారు. బీరకాయలు ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేకున్నాయి. సెంచరీ కొట్టింది. ఇక పచ్చిమిరపకాయల మాట ఎత్తుకుంటే కిలో రూ.వంద చొప్పున అమ్మకం సాగిస్తున్నారు. ఇదేమిటి అంటే ఈసారి పంట తక్కువగా ఉందని, గిరాకీ బాగా పెరిగిందని దుకాణదారులు చెప్పడం గమనార్హం. బెండకాయ రూ.50, పచ్చిమామిడి రూ.80, చిక్కుడు రూ.80, మటిక రూ.80, బూడిద గుమ్మడి ఒకటి రూ.60, అలసందలు రూ.100, తీపి గుమ్మడి రూ.40, క్యారెట్ కిలో 60, బీట్రూట్ రూ.60, ముల్లంగి రూ.60, కాకరకాయ రూ.90, క్యాబేజీ రూ.50, బీన్స్ రూ.140 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక ఆకుకూరల ఆరోగ్యానికి ఎంతో మంచివని వైద్యులు చెప్పడంతో వాటి ధరలు సైతం ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతంగా పెరిగాయి. ఏ ఆకు కూరను తీసుకున్నా రూ.10 ఉంది. ముఖ్యంగా మెంతి ఆకు, పాలకు, చుక్కాకు, గోంగూర, చింతాకు వంటివి కూడా అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక ఆదివారం వస్తే మాంసంలోకి కచ్చితంగా వాడే పుదీనా, కొత్తిమీర, అల్లం వంటివి కూడా ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యులు కొనాలంటే ఆందోళనకు గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇది ఇలా ఉంటే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ధరలను నియంత్రించాల్సిన అధికారులు ఏ ఒక్కరూ రైతు మార్కెట్ వైపు చూసిన పాపాన పోలేదు. కూరగాల తూకాల్లోనూ మోసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధితాధికారులు రైతు బజార్లలో, మార్కెట్లలో సందర్శించి కూరగాయల ధరలు తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి



మార్కెట్‌లోకి కూరగాయలు కొనడానికి వెళ్లాలంటే భయమేస్తోంది. గతంలో ఎప్పుడు లేని విధంగా కూర గాయల ధరలను పెంచేశారు. మార్కెట్లకు వెళ్తే ఏ కూరగాయలు కొని తినే పరిస్థితులలో లేం. అధికారులు స్పందించి కూరగా యల ధరలు వెంటనే నియంత్రించాలి.

- సరోజమ్మ, గృహిణి, రాయచోటి.

సంచుల్లోకి కూడా రావడం లేదు



కూరగాయలు మండి పోతున్నాయి. రోజూ వంట చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ఏ కూర చేయాలో తోచడం లేదు. కూరల సమస్య. నోటికి రుచికరంగా చేసుకుందా మంటే ధరలు మండిపోతున్నాయి. కొత్త ప్రభుత్వమైనా ధరలు అదుపులో ఉంచాలి.

- కె.హరిప్రియ, గృహిణి, సంబేపల్లె.

వ్యాపారులు దోచుకుంటున్నారు



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ విపరీతంగా రేట్లను పెంచడంతో రవాణా ద్వారా ట్రాన్స్‌పోర్టు ద్వారా నిత్యావసర, కూరగాయలు రేట్లు అధికమయ్యాయి. దీని వల్ల రైతుల కంటే దళారులు ఎక్కువ ఫలితం పొందుతున్నారు. రైతులు, వినియోగదారులు నష్టపోతున్నారు.

- సి.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

రైతుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

చిన్న, సన్న, మధ్యతరగతి రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ సందర్భంగా జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి గురువారం డిఆర్‌ఒ సత్యనారాయణ రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.67 లక్షల ఎకరాల వేరుశనగ పంట సాగుకు అవకాశం ఉందని తెలిపారు. 65 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అవసరం ఉంటే 55 వేల క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారని పేర్కొన్నారు. 38 క్వింటాళ్ల విత్తనాలు మాత్రమే సరఫరా చేశారన్నారు. 65 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. రైతులందరికీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసి పాస్‌బుక్ ఉన్న రైతులకు విస్తీర్ణంతో నిమిత్తం లేకుండా రెండు బస్తాల వేరుశనగ విత్తనాలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసిందని చెప్పారు. 1.5 ఎకరాల భూమికి మాత్రమే విత్తనాలు సరిపోతాయని తెలిపారు. మిగిలిన భూమి బీడుగా మారే అవకాశం ఉందన్నారు. 5 ఎకరాలు లోపు భూమి ఉన్న రైతులందరికీ హెక్టారుకు మూడు బస్తాల చొప్పున వేరుశనగ విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాల కోసం నమోదు చేసుకోవాలనే అవగాహన రైతులకు లేనందున ఎక్కువ మంది రైతులు ముందుగా నమోదు చేసుకోలేదని దీనివలన అవసరమైన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ లేదన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. నమోదు చేయని రైతులకు కూడా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. వేరుశనగ విత్తనాలతో పాటు ప్రతి హెక్టార్‌కు 25 కిలోల కందులు, 10 కిలోల అలసంద విత్తనాలు సరఫరా చేయాలని వరి, పెసర, ఉలవలు, జొన్న, సజ్జ మొదలైన విత్తలాలను కూడా సరఫరా చేయాలన్నారు. కౌలు రైతులు అందరికీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వరి, అరటి, బొప్పాయి, సాగు చేసే రైతులకు పచ్చరొట్టె ఎరువులు, విత్తనాలు సరఫరా చేసి ఆదుకోవాలని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులు అందరికీ (వరి, మామిడి, అరటి, బొప్పాయి, వేరుశనగ, టమోటా) హెక్టారుకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించి కరువు మండలాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందచేయాలన్నారు.అలాగే పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమం సిపిఎం నాయకులు ఎ.రామాంజులు, జి.మాధవయ్య పాల్గొన్నారు.

మదనపల్లెలో ఘోరం

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య

కన్న కూతురే హంతకురాలు

ప్రేమ వ్యవహారమే కారణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



దొరస్వామి (ఫైల్ ఫొటో)

పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. దిగువ కురవలంకలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కన్న కూతురే తండ్రిని హత్య చేయడంతో మదనపల్లెలో కలకలం రేగింది. డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐ వల్లిబాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎగువ కురవలంక, స్థానిక ఆంజనేయ స్వామి గుడి వీధిలో నివాసముంటున్న ఈరపు దొరస్వామి (62)కు కుమార్తె హరిత ఉన్నారు. ఏడాదిన్నర క్రితం భార్య లత అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి దొరస్వామి కుమార్తెను హరితను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. ఈ నెలాఖరులో రిటైర్డ్ కానున్న నేపథ్యంలో కుమార్తెకు పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నాడు. తన పేరుపై ఉన్న రెండంతస్తుల భవనాన్ని కూడా కుమార్తె పేరుపై రాశాడు. తండ్రి కుదిర్చిన సంబంధం ఇష్టం లేని హరిత విభేదిస్తూ వచ్చింది. తాను మరో యువకుడిని ప్రేమించానని అతనితోనే పెళ్లి చేయాలని పట్టుబట్టింది. ఈ క్రమంలో పెళ్లి విష యమై గత కొద్దిరోజులుగా తండ్రి కూతుర్ల మధ్య ఘర్షణ, వాగ్వాదం జరుగుతోంది. రాత్రి మరో మారు ఘర్షణ పడగా ఆవేశానికి లోనైనా హరిత కన్న తండ్రి అని కూడా చూడకుండా క్షణికావేశంలో రైటింగ్ ప్యాడు, చపాతీ రుద్దే కర్రతో తలపై దాడి చేసి తీవ్రంగా కొట్టి హతమార్చింది. హరిత ఒక్కటే హతమా ర్చిందా లేక ప్రియుని హస్తం కూడా ఉందా అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. తండ్రి మరణానంతరం హరిత తన బంధువులకు ఫోన్ చేసి నాన్న మద్యం తాగి పడిపోయాడని చెప్పింది. సమాచారం అందుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని దొరస్వామి మృతి చెందిన తీరును గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి, సిఐలు వల్లిబాషా, శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. అక్కడ హత్యకు గురైన ఆదారాలను సేకరించారు. మృతుడి కుమార్తె హరితను అదుపులోకి తీసుకొని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పలుకోణాల్లో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఉపాధ్యాయుడు దొరసామి కుమార్తె హరిత పాత్ర ఉందా? లేదా ఆమె ప్రియుని హస్తం ఉందా? మరి ఎవరిదైనా పాత్ర ఉందా అన్న కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి, సిఐ

గ్రామీణ మహిళలకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - రాయచోటి

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లపై గ్రామీణ మహిళలకు (అన్నమయ్య, కడప జిల్లాల) జులై 01 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్, కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కల గ్రామీణ నిరుద్యోగ మహిళలుపై శిక్షణా కార్యక్రమాలకు అర్హులున్నారు. గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణ తరగతుల కోసం తమ ఆధార్, రేషన్ కార్డులతో కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9440905478, 9985606866, 9440933028లలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని కొత్త బోయినపల్లె ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భారతి ఆధ్వర్యంలో గురువారం మిషన్ లైఫ్ రోజు వారీ కార్యక్రమాలలో భాగంగా సేవ్ వాటర్ సేవ్ ఎనర్జీపై చెట్లునాటి, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించడం వల్ల కార్బన్ పాదముద్ర కూడా తగ్గుతుందని తెలిపారు. తక్కువ నీటిని ఉపయోగించడం వల్ల పర్యావరణ వ్యవస్థల్లో ఎక్కువగా ఉంచబడుతుందని చెప్పారు. ఒట్టర్స్, వాటర్ వోల్స్, హెరాన్లు, చేపలు వంటి జంతువులకు చిత్తడి నేలల ఆవాసాలను అగ్రస్థానంలో ఉంచడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ ఉపాధ్యాయులు శారద మాట్లాడుతూ నీటి పొదుపు పద్ధతులను ఉపయోగించడం వల్ల డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. మన నదులు, బేలు, ఈస్ట్యూరీల నుండి తక్కువ నీటిని మళ్లించవచ్చన్నారు. బయాలజీ ఉపాధ్యాయులు శ్రీలత మాట్లాడుతూ ఇంట్లో శక్తిని ఆదా చేయడం అనేక కారణాల వల్ల ముఖ్యమైనదన్నారు. ఇది నెలవారీ బిల్లులపై డబ్బు ఆదా చేయడంలో సహాయపడటమే కాక భవిష్యత్ తరాలకు మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించేందుకు కూడా ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు టిఎండి షఫీ, పి.శివయ్య, పి.జనార్దన్, దండు సుబ్బారెడ్డి, ఎస్.వి.రామ రాజు, యన్.అమరావతి, ఎ.శివ ప్రసాద్, ఎస్.ప్రభాకర్ రావు, పి.ఎల్.ఎన్.వి ప్రసాద్‌రావు, పిడిఎం ఈశ్వర్ నాయక్, పి.విజయ భాస్కర్, ఎం.రెడ్డి బాబు, బి.శేషగిరి, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

- సంస్థపై ప్రజల సంతృప్తికర స్థాయిని పెంచేలా పనిచేయాలి
- వర్షాకాలం విద్యుత్ ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలి
- ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించి సంస్థపై ప్రజల సంతృప్తికర స్థాయిని పెంచేలా పనిచేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గురువారం కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో కడప, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు మండలాల క్షేత్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ప్రాంతాలలో వినియోగదారులకు నివాసాలు ఉంటూ వారి విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడూ పరిష్కరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడంలో భాగంగా విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా చూడాలన్నారు. విద్యుత్తును కొక్కేమల ద్వారా కాకుండా నాణ్యమైన సర్వీస్ వైర్ ద్వారా స్తంభం నుండి మీటర్ వద్దకు తీసుకునే విధంగా, భద్రతా నియమాలు విధిగా పాటించే విధంగా చూడాలన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి మరమ్మత్తైనా విద్యుత్ శాఖ సిబ్బందితో చేయి ంచుకునే విధంగా ప్రజలలో అవగాహన కలిగిం చేందుకు వార్తాపత్రికల ద్వారా, లోకల్ టీవీల ద్వారా, ప్రత్యక్షంగా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని తెలియ జేశారు. ఎర్తింగ్ చేయించుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఒంటిమిట్టలో ఓ గృహంలో జరిగిన విద్యుత్ ప్రమాదం ఎర్తింగ్ చేసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని తెలియజేశారు. కావున ప్రతి ఇంటికి విధిగా ఎర్తింగ్ చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 వినియోగించుకోవాలని తెలిపారు. మూగ జీవాలు ముందు వెళ్తుంటాయని పొలాలలో తెగిపడిన విద్యుత్ లైను పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. విద్యుత్‌ను సరైన పద్ధతిలో భద్రతా నియమాలు పాటించి వాడుకుంటే సౌకర్యంగా విలాసవంతంగా ఉంటుందన్నారు. విద్యుత్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు తప్పవని హెచ్చరి ంచారు. జిల్లాలోని విద్యుత్ కార్యాలయాలపైనా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, విధులలో అల సత్వం వహించిన ఉద్యోగులపై శాఖాభరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై విచారించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంశిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డైట్ ప్రాంగణంలో ఆర్ఎస్‌యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యను అభ్యసించడానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించి ఈనెల 4 న వెలువడిన ఫలితాలలో 67 మంది విద్యార్థులకి 720 కి 720 మార్కులు వచ్చి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం, వీరిలో ఏడుగురు విద్యార్థులు ఒకే సెంటర్లో ఉండడం అనేక అనుమానాలకు తావు ఇస్తోందని పేర్కొన్నారు. జూన్ 14 విడుదల కావాల్సిన పరీక్ష ఫలితాలను ముందుగానే ఎన్నికలు ఫలితాల్లో భాగంగా విడుదల చేయడం అనుమానాలకు గురిచేస్తుందని అన్నారు. దీనిపైన ఇప్పటికే దేశవ్యాప్తంగా నీట్ రాసిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే నీట్ పరీక్షాలను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై సమగ్ర విచారణను సిట్టింగ్ జడ్జితో జరిపించాలని, 24 లక్షల మంది మెడికల్ విద్యార్థుల భవిష్యత్తులను కాపాడాలని, మెడికల్ విద్యతో వ్యాపారాన్ని ఆపి జాతీయస్థాయిలో నీట్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు చరణ్, ప్రతాప్, మధుసూదన్, నవీన్. సంతోష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్ఎస్‌యు నాయకులు



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-పీలేరు

ఎపి మాస్ స్వచ్ఛంద సంస్థ పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం విత్తనాల పంపిణీ కార్యక్రమం చేశారు. 2019వ సంవత్సరంలో ప్రారంభమైన పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘంలో దాదాపు 800 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సంఘం ద్వారా రైతులకు అతి తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను అందించడంతో పాటు ఈ సంవత్సరం రైతులకు పెరటి తోట పెంపకానికి సంబంధించి పది రకాల విత్తనాలను 500 మంది రైతులకు, వేరుశనగ వేస్తున్న రైతులకు అంతర్ పంటగా ఐదు రకాల విత్తనాలు 50 మంది రైతులకు, పచ్చ రొట్టె ఎరువు కింద 27 రకాల విత్తనాలు కలిపి ఆరు కిలోల చొప్పున 200 మంది రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపిమాస్ డైరెక్టర్ వినాయకరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ భార్గవి, సిఇఒ ప్రత్యూష, ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధిషా వలి పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దు హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల ఆస్తులకు భద్రత లేని ఎపిభూ హక్కుల చట్టం జీవో నంబర్ 512 ను ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రమాణ స్వీకారం తర్వాత రెండవ సంతకం చేసి రద్దు చేయడం పట్ల ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, బి.దస్తగిరి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చట్టం అమలులోకి వస్తే ప్రజలకు మంచి జరుగుతుందని గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతాంగానికి మాయమాటలు చెప్పి మోసగించారని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రత్యామ్నాయ రాచరిక వ్యవస్థలను నిర్మించుకునే విధంగా భూ హక్కు చట్టం 27/2023 లాంటివి తీసుకురావడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను భంగపరచడమే అవుతుందని చెప్పారు. భూ యజమాని పేర్లను టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేయడానికి మండల స్థాయిలో ల్యాండ్ అథారిటీని అధికార పార్టీ నియమిస్తుందని పేర్కొన్నారు. చైర్మన్, కమిషనర్‌తో పాటు ముగ్గురు సభ్యులు ఉండేలా ల్యాండ్ అథారిటీని అధికార పార్టీ నియమిస్తుందని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం అధికార పార్టీ కన్ను సన్నల్లోనే ల్యాండ్ అథారిటీ, మండల టైటిలింగ్ ఆఫీసర్ అధికార పార్టీ చెప్పు చేతుల్లోనే ఉంటారని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ భూ యజమానుల పేర్లను టైటిల్ రిజిస్టర్ల నిజాయితీగా నమోదు చేస్తాడని గ్యారెంటీ ఏం ఉంటుందన్నారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన మరుసటి రోజే నుంచి రాజకీయ పలుకుబడి ఉపయోగించి అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు ఇద్దరు కుమ్మక్కుతో అడ్డు అదుపు లేకుండా భూకబ్జాలకు పాల్పడతారని పేర్కొన్నారు. ప్రజల బాధలు ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితి వచ్చిందని తెలిపారు.


పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్లో 1973-74 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు బి.నారాయణ, బి.రాజారెడ్డి, కె.చిన్నపరెడ్డి, పాటి మునిశంకరయ్య, కె.నాగరాజా, పి.వెంకటరమణారెడ్డి లు గతంలో పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారని అన్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు తమ వంతుగా ఏదో ఒకటి చేయాలని ఆలోచించి, ప్రస్తుత విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల లోపలి ఆవరణంలో మూడు లక్షల రూపాయల విలువ గల పార్కింగ్ టైల్స్ ను వేయించి దిద్దు తెలిపారు. పార్కింగ్ టైల్స్‌తో పాటు వాటిని వేయించడానికి అయ్యే ఖర్చును సైతం పూర్వ విద్యార్థులే భరించడం సంతోషంగా ఉందని అన్నారు. విద్యను అభ్యసించిన స్థలం దైవంతో సమానమని ప్రతి ఒక్కరూ ఎదిగే కొద్దీ మనం ఎదిగిన స్థలాన్ని, విధానాన్ని మరచిపోకూడదని తెలిపారు. పాఠశాలను సుందర ంగా తీర్చిదిద్దిన పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటగోపాల్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు

మండల సర్వసభ్య సమావేశం రద్దు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎంపిటిసిల సంఖ్యా బలం లేని కారణంగా మండల సర్వసభ్య సమావేశం రద్దయినట్లు ఎంపిడిఒ నూర్జహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ఎంపిపి, బయప్పగారిపల్లి ఎంపిటిసి మాత్రమే హాజరుకావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కనీస బలం ఆరుగురు ఎంపిటిసిలు హాజరు కాకపోవడం ఇందుకు కారణమని అన్నారు. ఎంపిటిసిలకు సమాచారం ఇచ్చామని, ఒకరు మినహా ఎవరు హాజరు కాలేదని తెలిపారు. అధికారులంతా తమ నెలవారి నివేదికలతో హాజరై నిరీక్షించి వెనుతిరిగి వెళ్లిపోయారని చెప్పారు .తిరిగి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించే తేదీని తెలుపుతామని ఎంపిడిఒ తెలిపారు.


మాట్లాడుతున్న దాత నాగరాజు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయచోటి నివాసి నాగరాజు కుమార్తె మనస్వి ద్వితీయ పుట్టినరోజు సందర్భంగా గురువారం బండపల్లి పంచాయితీ పరిధిలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేసినట్లు ట్రెజరర్ లయన్ హరీష్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన కుమార్తె జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు ఏదైనా అవసరం ఉంటే క్లబ్ వారు తనని సంప్రదిస్తే తన వరకు చేయగలిగిన సహాయం క్లబ్‌కి అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మదన్మోహన్ వరలక్ష్మి, నాగేష్, వెంకటరమణ, నారాయణమ్మ, మౌనిక, సుప్రియ ఆశ్రమ మేనేజర్ వెంకటసుబ్బయ్య, దేవా, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల సమైక్య ఎఫ్‌పిఒ గ్రామ సమైక్య సంఘాల సభ్యులు జమ ఖర్చుల పుస్తకాల నిర్వహణ సక్రమంగా నిర్వహించుకోవాలని ఆడిటర్ నాసిఫ్ తెలిపారు. గురువారం శ్రీ శక్తి భవన్‌లో ఆడిట్ నిర్వహించారు. మండల సమైక్య ఎఫ్‌పిఒ విఒ సంఘాలకు చెందిన రికార్డులు పరిశీలించి బ్యాంకు రుణాలు, చెల్లింపులు, జమ ఖర్చులు, తనిఖీ చేశారు. కార్యక్రమంలో డి ఎంజి మల్లయ్య, సిసిలు సంఘమిత్రలు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్ నాసిఫ్

క్షయ నిర్మూలనకు బిసిజి టీకా సురక్షితం

- డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ


కలకడ : వయోవృద్ధులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో 2025 నాటికి టిబి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిసిజి టీకాతో క్షయ వ్యాధి ని పూర్తిగా నిర్మూలించవచ్చని, ఈ టీకా ఎంతో సురక్షితమని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శైలజ, డాక్టర్ లక్ష్మీలు తెలిపారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన దొంతి వీధి, త్యాగరాజవీధి, ప్రశాంత్‌నగర్, ప్యారానగర్ సచివాలయాల్లో బిసిజి టీకా కార్యక్రమాలను తనిఖీ చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో వాక్సిన్ నిల్వ కేంద్రాలను, ల్యాబ్ లను పరిశీలించి టిబి కేసుల టెస్టింగ్ లను పెంచాలని సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అలాగే ప్రశాంత్ నగర్, ప్యారా నగర్ సచివాలయాలు ల లో వాక్సిన్ ప్రక్రియ గురించి ఆరోగ్య సిబ్బంది తో ఆరా తీశారు. వాక్సిన్ ఏ విధముగా వేయాలి, ఎవరికి వేయాలి, లబ్ధిదారులను ఏ విధంగా గుర్తించాలి, వారికి ఎలా అవగాహన కలిగించాలనే విషయాలపై చర్చించారు. వాక్సిన్ ప్రాముఖ్యత, ఆరు కేటగిరీల ను సిబ్బందికి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లు మాట్లాడుతూ 18 ఏళ్ల పై బడి 5 ఏళ్ల లోపు క్షయ కోర్సు మందులు మింగి, టిబి వ్యాధి నయం అయిన వారికి, క్షయవ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులకు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, ధూమపానం సేవించే వారికి, 60 సంవత్సరాలు పై బడిన వారు ఈ టీకా వేసుకోవాలన్నారు. ఈ టీకా ను అన్ని సచివాలయాలలో ప్రతి సోమవారం మరియు గురువారం 3 నెలలు పాటు ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది, సంబంధిత గ్రామ పంచాయితీ అధికారులు , అంగన్ వాడీ సిబ్బంది ని , టిబి ఛాంపియన్ లను సమన్వయ పరుచుకొని ఈ టీకా ప్రాముఖ్యత ప్రజలకు తెలియచేసే వాక్సిన్ కార్యక్రమం ను విజయవంతం చేయాలని, సూచించారు. గర్భిణులు, పాలు ఇచ్చు తల్లులకు, హెచ్ఐవి, క్యాన్సర్ రోగులు, గత మూడునెలల్లో రక్తమార్పిడి చేసుకున్న వారికి ఈ టీకా ఇవ్వడం జరగదని తెలిపారు. ప్రజలు అందరు అపోహలు వీడి స్వచ్ఛందముగా ముందుకు వచ్చి టిబి రహిత సమాజం కోసం పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ సల్మాన్ , డాక్టర్ రెడ్డి మోహిత్ గౌడ్ , సూపర్‌వైజర్ మహి జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెన్నా రెడ్డి , మదనపల్లె టిబి విభాగం సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుశీల, వనజకుమారి , హకీమ్ , కమర్ వల్లి మరియు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **వెలుగు పాఠశాలలో..** స్థానిక అమ్మచెరువు మిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో గురువారం అడల్ట్ బిసిజి టీకా కార్యక్రమం నిర్వహించారు. బొమ్మనచెరువు పిహెచ్‌సి డాక్టర్ ఫరూక్‌ఖాన్, వైద్య సిబ్బంది కలిసి 63 మందికి టీకాలు వేశారు. టీకా ప్రాముఖ్యత ను గూర్చి డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి** క్షయ వ్యాధి లేని సమాజం కొరకే బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్ష కులు నాగిరెడ్డి పేర్కొన్నారు. డిఎంహెచ్‌ఒ ఆదేశాల మేరకు మెడికల్ వైద్యులు డాక్టర్ చిన్న రెడ్డెప్ప ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బిసిజి టీకా కార్యక్రమాన్ని వారుపర్యవేక్షించారు. ప్రజలకు, వృద్ధులకు టీకా ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. మండలంలోని శీనయ్య కాలనీ, బండకాడ పల్లి, నడిమిపల్లి, గుండ్లురులలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమంలో టీకా వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, షుగర్ వ్యాధి గ్రస్తులు, సిగరేట్, బీడీలు అలవాటు కలిగిన వారు, టిబి వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టిబి రోగులతో కలిసి జీవించినవారు, ఎత్తుకు తగ్గ బరువు లేని వారు బిసిజి తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. ఇకపై ప్రతీ సోమ, గురు వారాలలో బిసిజి టీకాలు సంబంధించిన ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు. అనంతరం కలికిరి పోలీసు స్టేషన్‌లో పని చేసే సిబ్బందికి సిఐ ఆధ్వర్యంలో టీకా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు హేమలత ఎంఎల్‌హెచ్‌పిలు సైద బాను, గీత, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ:** భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఎర్రకోటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్‌బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ(టిబి)వ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని ఆరోగ్య విస్తరణ అధికారి జయరామయ్య అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు మండలం లోని పాపిరెడ్డిగారిపల్లె లోని డి.గొల్లపల్లి, దేవళ పల్లి లోని శ్రీనివాసపురం, కదిరాయచెరువులోని కదిరాయచెరువు, కె.దొడ్డిపల్లిలోని వంకవడ్డిపల్లి, ముదియంవారిపల్లి లోని మండెంవారిపల్లె, దిగువ పాలెంలోని మొబ్బామీదపల్లెలో గ్రామంలో వయోజన బిసిజి టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో టీ.బి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా టిబి మరణాల తీవ్రతను నివారించడంలో బిసిజి టీకా చాలా సురక్షితమైందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఇఒ సుబ్బరత్న, బి.రెడ్డమ్మ ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** ప్రాణాంతక వ్యాధుల నియంత్రణలో వ్యాధి నిరోధక టీకాలకున్న ప్రాముఖ్యతను గుర్తించి, పెద్దలకు ఇచ్చే బిసిజి టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. గురువారం పీలేరు మండలం, బోడుమల్లువారిపల్లె సచివాలయ పరిధిలోని మఠంకిందనగర్‌లో నిర్వహించిన అడల్ట్ బిసిజి టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ ఉషశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమ నిర్వహణా అంశాలను పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించుటకు ప్రజల భాగస్వామ్యం అవసరమని, అందుకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆమె సిబ్బందికి గుర్తు చేశారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన లబ్ధిదారులకు టీకాలు నిర్దేశించిన ప్రణా ళిక ప్రకారం వేసి వందశాతం లక్ష్యానికి చేరువ కావాలని డాక్టర్ ఉషశ్రీ సిబ్బం దికి సూచనలిచ్చి రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. కార్యక్ర మంలో పర్యవేక్షకులు కుసుమ, ఎఎన్ఎం రేణుక, సిహెచ్‌ఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

వర్షం పడితే బస్టాండ్‌లో చిత్తడే చిత్తడి


బురదమయంగా మారిన బస్టాండ్ ఆవరణం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని స్థానిక ఆర్‌టిసి బస్టాండులో కొద్దిపాటి వర్షం పడితే నీరు నిల్వ ఉండి బస్టాండ్ అంతా చిత్తడి చిత్తడిగా బురదమయమై పోతోందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఎక్కాలన్నా, బస్సు దిగాలన్నా ప్రయాణికులను బురద నీటిలో కాలు పెట్టి వెళ్ళాల్సిందేనని అంటున్నారు. గాలివీడు బస్టాండ్ నుంచి మదనపల్లి, కదిరి, రాయచోటి డిపోల నుంచి బస్సులు వచ్చి వెళ్తూ ఉంటాయని ఇక్కడ ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యంగా బస్టాండ్‌లో మట్టి స్థలాన్ని సిమెంట్ పూత పూసి లేదా సిమెంటు రోడ్డు వేస్తే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. రాయచోటి డిపోకు ప్రతి ఏడాదికి రెండు మూడు లక్షల రూపాయలు తోపుడు బండ్లు, పూల అంగల్లు, టీ బంకులు ద్వారా ఆర్‌టిసికి ఆదాయం వస్తున్నా ఇక్కడ మౌలిక వసతుల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు దృష్టిపెట్టి బస్టాండ్‌లో మౌళిక వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.


కుంటను తలపిస్తున్న రోడ్డు

రహదారి ఇలా...ప్రయాణం ఎలా?

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.వంగిమళ్ళ పంచాయతీ నల్ల పర్వతయ్యగారిపల్లి రోడ్డుపై వర్షపు నీరు నిలబడటంతో ప్రజలు, వాహనదారులు, రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ నుంచే వచ్చే వర్షపు నీరు రోడ్డుపైన నిలబడుతుంది. దిగువ ప్రాంతానికి వెళ్లటానికి వీలు లేకుండా ఉంది. సంబంధిత పారిశుధ్య అధికారులు, కార్మికులు రోడ్డుపై ఉన్న వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీర్ల పండుగను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, తుమ్మరగుంటలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు పీర్ల పండుగ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీర్ల పండుగలో భాగంగా 20న శనివారం సాయంత్రం పీర్ల పండుగ గుద్దిలి, 24వ తేదీ బుధవారం తుమ్మరకుంట, తుమ్మరకుంటవారిపల్లిలో పీర్ల ఊరేగింపు, 25న గురువారం సామాడపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, గజ్జలవారిపల్లి పీర్ల ఊరేగింపు, 26న శుక్రవారం బండమీదపల్లి (ఎగువ,దిగువ), బురదవారిపల్లి పీర్ల ఊరేగింపు 27వ తేదీ శనివారం సర్వీస్,రాత్రి 7 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం,28వ తేదీ ఆదివారం పీర్ల జల్ది, 30న మంగళవారం మునాల్ల శాస్త్రం జరుగునన్నారు. కావున మండలం,నియోజకవర్గంలోని ప్రజలు పీర్ల పండుగ మహోత్సవానికి విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి మారెమ్మ పొంగళ్లు మహోత్సవం

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలో ఈనెల 14వ తేదీ శుక్రవారం నుంచి అమ్మవారి పొంగళ్ళ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14న శుక్రవారం ఆలయంలో మహాగణపతి పూజా కార్యక్రమాలతో ప్రారంభించి ధ్వజారోహణ కార్యక్రమం, మహా గణపతి హోమం, మారెమ్మ తల్లి మూలమంత్ర హోమాలు నిర్వహిస్తామన్నారు. 15న శనివారం ఉదయం 8 గంటలకు చండీ హెూమం, విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం 12 గంటలకు భోజన సదుపాయాన్ని కల్పించినట్లు ఆలయ నిర్వహణ తెలిపారు.16న ఆదివారం ఉదయం 10 గంటలకు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సోమవారం అమ్మవారికి పాలాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. ఆయా కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రామ సంఘాలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి రామాలయం దగ్గర మండల సిసి రుద్రాచారి అధ్యక్షతన పంచాయతీలో గల డ్వాక్రా సం ఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా సిసి మాట్లా డుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న డబ్బును డ్వాక్రా మహిళలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీని అందుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క గ్రూపు సకాలంలో బ్యాంకులో డబ్బులు జమ చేయాలని పేర్కొన్నారు.

నేడు కూటమి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి-ములకలచెరువు : మండలంలోని బురకాయలకోటలో కూటమి ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్, మంత్రిగా నారాలోకేష్‌తో పాటు ఇతరులు ప్రమాణస్వీకారం చేయడం చేసిన సందర్భంగా బురకాయలకోటలో బైక్ ర్యాలీతో పాటు కేక్ కటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.


మొక్కలు నాటుతున్న ఎంఇఒలు

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

పాఠశాలల్లో మిషన్ లైఫ్ ఆక్టివిటీస్‌లో భాగంగా గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టా రు.ఎంఇఒ కార్యాలయం ఆవరణంలో ఎంఇఒలు పి.రెడ్డిబాషా, డి.సుబ్రమణ్యంరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి పరిరక్షణ చేపట్టి పర్యావర ణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల చేత నేచర్‌వాక్ నిర్వహించి పిల్లలకు ప్రకృతి సమతుల్యత, పర్యావరణం మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది, మండలంలోని కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాండవ్య నదిలో ఉన్న నీటి కొలను

నీటి కుంటల చెంతకు వెళ్లకండి

ప్రజాశక్తి-వీరబల్లి

వర్షాకాలంలో నీటితో ఉన్న కుంటల వద్దకు పిల్లలు వెళ్లకూడదని ఎస్ఐ చంద్రమోహన్ పేర్కొన్నారు. మండలంలోని పుల్లగూర గండి దగ్గర మాండవ్యనదిలో తీసిన నీటి కుంట వద్దకు పిల్లలు వెళ్లకూడదని, అక్కడకు వచ్చిన యాత్రికులకు, ప్రజలకు, తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటి కుంటల్లోకి భారీగా నీరు చేరుతుందని అన్నారు. మాండవ్య నదిలో ఉన్న నీటి కొలను దగ్గరికి సరదా కోసం నీటి వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

18న పట్టుబడిన వాహనాల వేలం

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు సెబ్ స్టేషన్ పరిధిలోని పట్టుబడిన వాహనాలకు ఈ నెల 18న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ములకలచెరువు సెబ్ సిఐ రాంమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలు ములకలచెరువు సెబ్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని, వేలం పాటల్లో పాల్గొనే వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటల్లో పాల్గొనవచ్చునని సిఐ రాంమోహన్ పేర్కొన్నారు.

మంత్రులను కలిసిన 'కసూర్తి'

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రాష్ట్ర మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు టిడిపి సీనియర్ నాయకులు మాచినేని విశ్వేశ్వరనాయుడు కలిసి వారిని ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రేపల్లె నియోజకవర్గం శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్, ఆత్మకూరు శాసనసభ్యులు ఆనం రాంనారాయణరెడ్డి, ఉరవకొండ శాసనసభ్యులు పయ్యావుల కేశవ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అమరావతిలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి నాయుడోరి రమణ,రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులేల రమేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాకర్ల రెడ్డయ్య, నాయకులు పాల్గొన్నారు.


మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కస్తూరి, మాచినేని

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మ రణం చెందిన సంఘటన బుధవారం రాత్రి గుర్రంకొండ మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చెర్లోపల్లి పంచాయతీ కమ్మపల్లెకు చెందిన సునీత రామ్మో హన్‌నాయుడు దంపతులు మూడేళ్లుగా గుర్రం కొండలో నివాసముం టు న్నారు. సమీపం లోని తురకపల్లి వద్ద 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసు కొని టమాటా పంట సాగు చేస్తున్నారు. బుధ వారం రాత్రి టమోటా తోట నుంచి రామ్మో హన్ నాయుడు, సునీత దంపతులు గుర్రంకొండకు ఆటో లో బయలు దేరారు. మార్గ మధ్యంలోని మావిళ్ళవారిపల్లె వద్ద ఆటో అదుపు తప్పడంతో సునీత కింద పడి పోయింది. ఇంతలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఆమెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే బాధితురాలి,ని భర్త, స్థానికులు 108లో మదనపల్లె సర్వజన బోధనాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. సునీత మృతితో కుటుంబంలో విషాద ఛాయ లు అలముకున్నాయి. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.